
# కొత్త జీతగాడు



"తాత... నాకు జాబ్ దొరికింది. కంప్యూటర్ ఇంజనీర్‌గా జాయినయ్యాను. నెలకు పదివేలు జీతం. రెండు నెలల జీతం అడ్వాన్సుగా ఇచ్చారు." ఇంట్లోకి అడుగుపెట్టగానే చెప్పాడు నవీన్. లక్ష్మి మొహం విప్పారింది. ఆమె కళ్ళల్లో ఆనంద భాష్పాలు మొలిచాయి. రాములు పట్టరాని సంతోషంతో కొడుకును అక్కున చేర్చుకున్నాడు. అతడికి నెత్తిమీద ఏదో పెద్ద బరువు దింపుకున్నట్టుగా రిలీఫ్‌గా ఉంది. తిరుపతయ్య మాత్రం మనవడి వైపు ఉదాసీనంగా చూశాడు. 'మీ ఫ్రెండ్ ఎవరో కొత్త ప్రాజెక్ట్ మొదలుపెడుతున్నాడని చెప్పావుచూడు. అందులోనా...?' ఉత్సాహంగా అడిగాడు రాములు.

స్వీట్ ప్యాకెట్ విప్పుతూ 'అవును నాన్నా.. ప్రాజెక్ట్‌కి నేనే డైరెక్టర్‌ని. మా ఫ్రెండ్ రెండు మూడు నెలల్లో అమెరికా వెళ్ళిపోతున్నాడు. ఒకరకంగా చెప్పాలంటే నేనున్నానన్న ధీమాతోనే ఈ ప్రాజెక్టు మొదలు పెట్టాడు' అంటూ తాతవైపు చూశాడు నవీన్.

తిరుపతయ్య మొహంలో ఏ భావమూ లేదు. మసకబారిన కళ్ళను తుడుచుకుంటున్నాడు. నవీన్‌కు విచిత్రమనిపించింది. తాతంటే అతడికి గౌరవం. అంతకు మించి అభిమానం. తన వెన్ను తట్టి ప్రోత్సహించి ప్రయోజకుడు కావాలని ఆరాటపడిన తాత, ఈ విషయం చెప్పగానే మురిసిపోతాడనుకుంటే ఇలా నిరాసక్తిగా ఉన్నాడేంటీ?.. అనుకున్నాడు. ముందుగా స్వీటు అందిస్తూ.. "అదేంటి తాతా.. నీకు వినపడలేదా? నాకు ఉద్యోగం దొరికింది. ప్రాజెక్ట్ డెవలప్ అవుతుంటే మాకు సాలరీ కూడా పెరుగుతుంది.

నా చిన్నతనంలో అనేవాడివి గుర్తుందా? మాదిగి తిరుపతి మనవడు ఇంత పెద్ద కొలువు జేత్తుండా! అని అందరూ ఆశ్చర్యపోయేంత చదువు చదివి జాబు సంపాదించాలని. అదిప్పుడు సాధించాను'' గర్వంగా అన్నాడు నవీన్.

స్వీటు అందుకుంటూ చిన్నగా నవ్వాడు తిరుపతయ్య. ఆ నవ్వులో విరక్తి ధ్వనించింది. మనవడి మొహంలో మారుతున్న భావాల్ని పసిగట్టి మామూలుగా ఉండటానికి ప్రయత్నించాడు. అది కుదరడంలేదు. అత్యున్నత శిఖరాలను అధిరోహించాననుకున్న వ్యక్తికి తానున్నది చిన్నకొండ మీదనే అని తెలిసాక కలిగే వైరాగ్యం కలిగింది. అది వారికి అర్థం కాదని చెప్పినా అర్థం చేసుకోరని తెలుసు.

'నువ్వు కూడా ఒక ప్రాజెక్టును మొదలెట్టలేక పోయావా?...' మనవడిని మాటల్లోకి దింపుతూ అన్నాడు తిరుపతయ్య. మాట వరసకి అలా అన్నాడే కాని తాను అడిగిన ప్రశ్న ఎంత అసమంజసంగా ఉందో వెంటనే అర్థమైంది.

తాతను వెర్రివాడ్ని చూసినట్టుగా చూశాడు నవీన్. 'ప్రాజెక్టు అంటే నీకు తెలీదు తాతా! లక్షల విలువచేసే కంప్యూటర్లు కావాలి. లక్షల పెట్టుబడి పెట్టాలి. మరో పది పదిహేనేళ్ళ తరువాత డబ్బును కూడబెట్టి నా కొడుకు చేత పెట్టిస్తాను' నవ్వులాటకు అన్నట్టుగా అన్నాడు.

తిరుపతయ్యకు అలా అనిపించలేదు. జీవితాన్ని గెలుచుకునే క్రమంలో తరాల అలసత్వాన్ని ప్రశ్నించినట్లు అనిపించింది. అతడి గొంతులో మరింత నిరాసక్తి ధ్వనించింది. 'అప్పటికి వాళ్ళు స్వర్గానికి నిచ్చెనలు వేస్తారు. అందనంత దూరం ఎదిగిపోతారు. చంద్రుని మీద ఇండ్లు కట్టుకుంటారు' అన్నాడు.

ముగ్గురూ అతడివైపు విస్మయంగా చూశారు. 'వాళ్ళంటే ఎవరు మామా?' అర్థంకాక అడిగింది లక్ష్మి.

'వాళ్ళంటే... వాళ్ళే.. సమాంతర రేఖల్లా.. ఎప్పుడూ తరతరాలుగా మనం అందుకోలేనంత దూరంలో ఉన్నవాళ్ళు. ఎదిగినామని మనం అనుకుంటే... మనకంటే నాలుగు మెట్లు పైనే ఉండి వెక్కిరించే వాళ్ళు..' మనవడి వైపు, కొడుకు, కోడలువైపు ఉద్విగ్నంగా చూస్తూ చెప్పాడు తిరుపతయ్య. అతడి కళ్ళముందు జీవిత చక్రం గిర్రున తిరుగుతుంది. పీడకలలాంటి గతం.

❄ ❄ ❄ ❄

'అవున్రా మేం పెట్టి పుట్టాం. మీ జాతి పది జన్మలెత్తినా మాకు జీతముండాల్సిందే. ఎవరేం పని చేయాలో ఆ దేవుడే నిర్ణయించాడు. జీతగాని కొడుకు జీతముండక ఇంకేం జేస్తడురా! ఆ మాటంటే నీకు రోషమచ్చిందారా!' జగిలి మీద కూర్చున్న దొర మండిపడుతున్నాడు.

నేను ముందుగా దొరను చూడలేదు. దొర కొడుకును ఏమనలేదు. వీపు మీద ఎక్కిన దొర కొడుకును దించి ఏడుస్తున్న నా కొడుకును మట్టి దులిపి ఎత్తుకున్నాను. వాళ్ళు 'దొర-జీతగాడు' ఆట ఆడుకుంటున్నారు. నేను కచ్చురం(ఎడ్లబండి) ముందు పరుగెత్తడం దొర కొడుకు చూశాడు. వాళ్ళు ఏ ఊరు వెళ్ళాలన్నా సవారు కచ్చురం కట్టాల్సిందే! ముందు నేను ఉండాల్సిందే! వెనుక ఒక చాకలి, మరో మంగలి, మస్కూరోళ్లు. పరుగులెత్తి ఆయాసం తీస్తున్నా, బండి ముందు దొర నన్నే ఉంచాడని నాకొక రకమైన గర్వం. ఎడ్లబండితోపాటు పరుగెత్తుకు వస్తున్నా, వెనుక ఉన్నవారికి

ముందున్న నాపై ఈర్ష్య!

దొర కొడుకు నా కొడుకు అదే ఆటాడుతున్నారు. వాడి వీపు మీద కూర్చుండి పరుగు తియ్యమంటున్నాడు. మట్టిలో అంబాడుతూ మోకాళ్ళు గీరుకుపోయి ఏడుస్తుంటే నా కొడుకు వీపు మీది నుండి దొర కొడుకును కిందికి దించాను ఆట ఆగిపోయిందని అతడు ఏడుస్తూ తండ్రి వద్దకు పరుగుతీశాడు.

నా ముందటే కొడుకు ముచ్చట తీర్చడానికి నన్ను అదిలించి ఇంకొద్దిసేపు ఆ ఆటను ఆడించాడు దొర. ఆటను చూసి కొద్దిసేపు విరగబడి నవ్వాడు. నా మనసు కుతకుత ఉడికింది.

ఆ రాత్రి నాకు నిద్రలేదు.'దొర కొడుకుదొరే !జీతగాని కొడుకు జీతగాడే!ఎవరేం పని చేయాలో దేవుడే నిర్ణయించాడు' ఈ మాటలే చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఎక్కడ బతికినా నాకున్న ఆస్తిరెక్కలే! మరునాడు తెల్లవారక ముందే ప్రయాణమయ్యాను. ఎవరికీ చెప్పలేదు. అప్పుడు నా కొడుకు రాములుకు ఏడేండ్లు.

కామారెడ్డి చేరుకున్నాక వారం రోజులు రైల్వేస్టేషన్‌లో తలదాచుకున్నాం. గంజిలో హమాలీ పని దొరికింది. నా భార్య మార్కెట్‌లో కూరగాయల మారుబేరం మొదలెట్టింది. రాములును స్కూల్లో వేశాం. వాడు చదువుకోవాలి. ఈ 'జీతగాడు' జీవితంలోంచి ఎదగాలి. అదే నా పట్టుదల. కడుపు కట్టుకుని డబ్బును వెనకేశాను. వాడి చదువుకు ఖర్చు చేశాం. వచ్చే ఆదాయమే తక్కువ. అందులో మిగిలేది మరీ తక్కువ. ఆ ఆరాటంలో మా ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయలేదు. అది తెలుసుకునేసరికే ఆలస్యమయింది. నాభార్య కన్నుమూసింది.

పుట్టెడు దుఃఖంలోనూ నాలో పట్టుదల పెరిగింది. రాములును పదవతరగతి వరకు చదివించాను. అప్పటికే నాలో శక్తి పూర్తిగా హరించుకుపోయింది. బరువులు ఎత్తలేకపోయాను. రాములు చదువు ఆగిపోయింది. చిన్నతనాన్నే కుటుంబ బరువును నెత్తికెత్తుకున్నాడు. పెద్ద దుకాణంలో పద్దులు రాయడానికి కుదిరాడు. జీతం బాగానే ఉండేది. నేను కూడా కూరగాయలమ్మి, మూటలు మోసి మిగిలిన డబ్బును రాములుకు ఇచ్చేవాడిని. రెండేళ్ళు తిరక్కముందే ఇల్లుకు స్థలాన్ని కొన్నాడు రాములు. ఆరు నెలల్లో రేకుల షెడ్డు వేశాడు. అదే యేడు పెళ్ళయింది.

పొద్దున్నే షాపుకు వెళ్ళేవాడు. మధ్యాహ్నం భోజనానికి వచ్చేవాడు. రాత్రి వచ్చే సరికి పది దాటేది ఫ్యాను కింద కూర్చుండి సామానులు అందించడం, పద్దులు రాయడమేనని మురిపెంగా చెప్పేవాడు. తాను ఒక్కనాడు లేకపోయినా దుకాణం నడవదని, యజమాని తనకు షాపును, గల్లాపెట్టెను నమ్ముతాడని చెప్పేవాడు. కొన్ని రోజులు గడిచాక నమ్మకంగా పనిచేస్తున్నాడని జీతం పెంచి రాములును బట్టల దుకాణంలోకి మార్చారు.

ఒకనాడు ఇంటికి కొన్ని సరుకులు తెచ్చాడు. అది తన యజమాని ఇంట్లో ఇవ్వాల్సిన వస్తువులని వీలులేక తాను వెళ్ళలేకపోయానని అడ్రస్ ఇచ్చి నాచేత పంపించాడు రాములు. నెత్తిమీద మూటతో అడ్రస్ వెదుక్కుని ఆ ఇల్లు తలుపు తట్టాను.

తలుపు తెరిచిన వ్యక్తిని ముందుగా గుర్తు పట్టలేదు. గుర్తు పట్టాక నా కాళ్ళకింది భూమి కదిలింది. ఆమె... ప్రమీల దొర్సాని, జుట్టునెరిసినా దర్పం తగ్గలేదు. ఒకసారి ఎగాదిగా చూసి,

'నువ్వారా తిరుపతీ... ఎక్కడున్నావురా..' అని అడిగింది.

నా సమాధానం వినకుండానే తన కొడుకులు ఎవరేం చేస్తుంది. అల్లుండ్లు, కూతుళ్ళు ఎవరెక్కడ ఉన్నదీ వాకిట్లో నిలబెట్టే చెప్పింది. తన పెద్ద కొడుక్కు ఏయే దుకాణాలున్నవి, ఎక్కడెక్కడ ఉన్నవి, పేర్లతో సహా చెప్పింది.

నాకు భూమిలోకి కూరుకుపోతున్నట్టుగా అనిపించింది. ముల్లెను భద్రంగా అప్పగించి ఇంటిదారి పట్టాను. ఆలోచనలు మెదడును తొలుస్తున్నాయి. నేను ఎక్కడ జీవితం మొదలెట్టాను.. ఎక్కడికి చేరుకున్నాను! ఈ జీవితంలోంచి ఎదిగాడనుకున్న కొడుకు జీతగాడికి రూపాంతరంగా దొరకొడుకు వద్దనే జీతమున్నాడు. నిజంగా జీతగాని కొడుకు జీతగాడే! ఆ పరిధిలోంచి పారిపోయి ఇక్కడికి వచ్చి నేను సాధించింది ఏమిటి?

నాకు నీరసం ముంచుకొచ్చింది. ఎన్నడూ లేనిది దుకాణంలో కొడుకు ఏం చేస్తాడో చూడాలనిపించింది. అక్కడ... కౌంటర్ ముందు దొర పెద్దకొడుకు దొరలాగే కూర్చున్నాడు. ఎవరినో ఒప్పిస్తూ, బట్టలు చూపిస్తూ, నవ్విస్తూ మెత్తని తివాచీ మీద పచ్చగడ్డి మీద గానుగెద్దులా తిరుగుతున్నాడు రాములు. అప్పుడప్పుడూ యజమానిఏదో అరుస్తున్నాడు. తిడుతున్నాడు. అచ్చం దొరలాగే..

ఆ రాత్రి రాములు నాకు మళ్ళీ చెప్పాడు. లక్షల గల్లపెట్టెను యజమాని తనకు నమ్ముతాడని. ముప్పై నలభై పుట్లవడ్లకల్లాన్ని దొర తనకు నమ్మి ఊరికి వెళ్ళడం గుర్తుకొచ్చేది నాకు. ఈ విషయం నేను రాములుకు చెప్పలేదు. నేను ధిక్కరించిన జీవితాన్ని నా కొడుకు మోస్తుండటం జీర్ణించుకోలేక పోయినా, నిజం చెప్పి వాడిని కలవరపెట్టడం నాకిష్టంలేదు.

రాములుకు కొడుకు పుట్టాడు. నాకు మల్లే మళ్ళీ సంతానం కాలేదు. నా ఆశలన్నీ నవీన్‌పైనే! వీడిని పెద్ద చదువు చదివించాలని. ఈ చాలీచాలని బతుకుల్లోంచి బయటకు నెట్టాలి, నాకంటే రాములుకే ఎక్కువ ఆరాటం.

నవీన్‌ను ఇంగ్లీషు మీడియంలో వేశారు. నా కొడుకు జీవితం కూడా నాలాగే ఉంది. వాడు కష్టపడుతున్నాడు. వాడి భార్య కూడా కష్టపడుతున్నది. పూలమాలలు కట్టి అమ్ముతుంది. పెళ్ళిళ్ళ సీజన్‌లో రాత్రంతా మేల్కొని దండలు అల్లుతుంది. నేను మూటలు మోసి ఏ తిండి తిన్నానో వాళ్ళు ఇప్పుడూ అదే తింటున్నారు. రాములు చదువుకు నేను ఎన్ని అవస్థలు పడ్డానో వాళ్ళూ అవే అవస్థలు పడుతున్నారు. నా వలెనే అప్పుడప్పుడూ పస్తులుంటున్నారు.

నా కొడుకు జీవితంలో మార్పును కోరుకున్నాను. అందుకే ఊరు విడిచి వచ్చేశాను. మూడు పూటలా తిండికూడా సరిగా దొరకని జీవితంలో వాడు స్థిరపడ్డాక, వాడు గెలుచుకున్న జీవితమేదీ లేదని తెలిశాక నా ఆశలన్నీ నవీన్ పైనే పెంచుకున్నాను.

అతికష్టం మీద నవీన్ చదువు పూర్తయింది. తలకు మించిన భారంగా చదివిన చదువు పూర్తయ్యాక రాములుకు కొండంత తృప్తి కలిగింది. అప్పటికే నవీన్‌కు పెళ్ళయింది. చదువులో కొంతయినా ఆర్థికభారం మోస్తారని కొడుక్కు పెళ్ళి చేశాడు రాములు. అతడి ఆశ నెరవేరలేదు. కోడలు ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా చేరి కొంత ఊరటను కలిగించింది.

చదువు పూర్తయ్యాక భార్యతో హైదరాబాద్‌లో కాపురం పెట్టాడు నవీన్. లక్షల పెట్టుబడితో తన ఫ్రెండ్ ఒక ప్రాజెక్టును ప్రారంభిస్తున్నాడని తనకు అందులో జాబ్ దొరుకుతుందని చెప్పి అందరినీ ఓపెనింగ్ ఫంక్షన్‌కు తీసుకెళ్ళాడు నవీన్.

చదువు లేకపోయినా నాకు సమాజం తెలుసు. నా మనవడు ఒక కంప్యూటర్ ఇంజనీర్‌గా ఎదిగినందుకు ఎంతగానో సంతోషిస్తూ ఫంక్షన్‌కు వెళ్ళాను.

బయట కార్లు, స్కూటర్లు, రకరకాల వాహనాలు.

లోపల మామిడి తోరణాలు, రకరకాల మనుషులు, పెద్ద షామియానా, నాలుగైదు కంప్యూటర్లు... మధ్యలో కుర్చీ... కుర్చీలో ప్రమీల దొర్సాని! మళ్లీ కాళ్లకింద భూమి కదిలింది.

తన చల్లని చూపులతో వచ్చిన వారందరినీ దీవిస్తున్నట్టుగా చూస్తూ...

నన్ను గుర్తుపట్టి 'నువ్వేనారా తిరుపతీ... ఇప్పుడు ఎక్కడున్నావురా!' అంటూ తన మనవలు ఎవరెక్కడ ఉన్నది, ఎవరేం చేస్తున్నది, ఈ ప్రాజెక్టుకు ఎంత ఖర్చయిందీ వివరంగా చెప్పింది.

నా మెదడు ఆలోచించలేనంతగా మొద్దుబారిపోయింది. దొర మనవడు దొరలాగే తిరుగు తున్నాడు. ఆజ్ఞాపిస్తూ అధికారికంగా కాకపోయినా అనునయంగా పనులు చేయించుకుంటున్నాడు. నా మనవడు అతడి ముందు వినయ విధేయతలు ప్రదర్శిస్తున్నాడు.

పది జన్మలెత్తినా జీతగాడు జీతగాడే! నా తరం మళ్ళీ మొదటికి వచ్చింది. ఇప్పుడు కూడా నా మనవడు బయట పడలేకపోయాడు.

❄ ❄ ❄ ❄

'తాతా... ఏంటి? నిద్రపోయావా?' నవీన్ కుదుపుతుంటే తేరుకున్నాడు తిరుపతయ్య. అప్పటికే ముల్లెలూ మూటలు రెడీగా ఉన్నాయి. కొడుకు బర్త్‌డే ఉందనీ అందరినీ రెడీ చేశాడు నవీన్. తిరుపతయ్య అయిష్టంగానే కదిలాడు. రెండు గంటల్లో హైదరాబాద్ చేరుకుని ఆటోలో ఇంటికి చేరుకున్నారు. అప్పటికే దొర మనవడు శేఖర్, అతడి భార్యా కుమారుడు అక్కడికి చేరుకున్నారు. కొద్దిసేపు మాట్లాడి నవీన్,శేఖర్ కలిసి కారులో బయటకు వెళ్లారు.

శేఖర్ కొడుకు, నవీన్ కొడుకు కంప్యూటర్ ఆట ఆడుకుంటున్నారు. ఆసక్తిగా వెళ్ళి వారికి దూరంగా కూర్చుని గమనించాడు తిరుపతయ్య. శేఖర్ కొడుకు తండ్రిలాగే ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు. నవీన్ కొడుకు తలూపుతున్నాడు. మనసులోనే నవ్వుకున్నాడు తిరుపతయ్య.

తను రావడం కుదరదని కేక్ కట్ చేయించమని ఫోన్ చేశాడు నవీన్. 'అదంతే తాతయ్యా! ప్రాజెక్టు కొత్తగా మొదలెట్టారు కదా! వర్క్ ఎక్కువగా ఉంటుంది.' శ్రీదేవి సంజాయిషీ ఇచ్చి కేక్ కట్ చేయించింది.

రాత్రి పన్నెండు దాటాక వచ్చాడు నవీన్. కాస్త మందు తీసుకున్నట్టుగా అనిపించి పలకరించలేదు తిరుపతయ్య. తెల్లవారాక తనే చెప్పాడు నవీన్. రాత్రి జరిగిన పార్టీ గురించే కాక తనకు శేఖర్ ఇవ్వబోయే సెల్‌ఫోన్, కారు గురించి కూడా గొప్పగా చెప్పాడు.

'చాల్లేవోయ్! నేను జీతమున్నప్పుడు పెద్దదొర ఇలాగే నాకు గొంగడి, చెప్పులు కొనిచ్చాడు.

కల్లాల మీద కుండల కొద్ది కల్లు తాగించేవాడు. ఆ సంతోషంలో రెండు రోజుల పని ఒక్కటేనాడు చేసేవాడిని. మన జీతగాల్లతోని ఎట్ల పని చేయించుకోవాలో, ఎలా లాభం పొందాలో వారికి బాగా తెలుసులేవోయ్' ఎగతాళిగా అన్నాడు తిరుపతయ్య.

'నాకు తెలుసు తాతా! నేను గెలుచున్న జీవితాన్ని నువ్వు ఒక కోణంలోంచి చూస్తున్నావు. పిడికెడు మెతుకుల కోసం ఆత్మవంచన చేసుకుని ఆనాటి దొర మీద ఆధారపడ్డావు. కానీ ఈ నాటి దొర నా తెలివితేటల మీద ఆధారపడ్డాడు. నీ తరం నుండి మా తండ్రి తరానికి, తర్వాత నా తరానికి లభించిన స్వేచ్ఛ, భావప్రకటనను కేవలం ఆర్థిక వెసులుబాటుతో ముడివేస్తున్నావు. నేను, శేఖర్ ఫ్రెండ్స్‌మి. 'అరే' అంటే 'అరే' అనుకుంటాం. మా మధ్య అవసరాల మార్పిడిని బానిస కోణంలోంచి చూసే నువ్వు ఆలోచనా క్రమంలోంచి ఎదగలేదు' అంటూ లేచాడు నవీన్.

భర్త ద్వారా విషయమంతా ముందుగానే తెలుసుకున్న శ్రీదేవి ఎవరు ఎదిగారన్న విషయంలో ఆలోచనల్లో పడిపోయింది ●